సాక్షి సంగారెడ్డి

శుక్రవారం : 10 : మార్చి : 2023



నీళ్లు.. మింగేస్తున్నాయ్

ఈత సరదా, చేపల వేట, స్నానాలు చేసేందుకు వెళ్లేవారిని చెరువులు మింగేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఐదు రోజుల్లో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. 8లో



గొర్రెలను కడగడానికి వెళ్లి.. 8లో

చెరువులో గొర్రెలను కడిగేందుకు వెళ్లి నీట మునిగి తండ్రీకొడుకు మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో చోటు చేసుకుంది.



అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. 9లో

న్యూస్‌రీల్

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మత్స్యశాఖ అధికారులు, సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటిరకు 4,930 మంది కొత్త సభ్యులకు గాను 1,626 మంది నమోదయ్యారని, లక్ష్యాన్ని పూర్తి చేయడంలో సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి అందరూ సభ్యత్వం పొందేలా చూడాలన్నారు. ఈ నెలాఖరు లోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్షలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మత్స్య శాఖ ఏడీ సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి కేదార్‌నాథ్ దర్శనం



శివలింగ మహరాజ్‌ను సన్మానిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయంలో ఏప్రిల్ 25 నుంచి దర్శనాలు ప్రారంభం అవుతాయని కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ మహరాజ్ తెలిపారు. పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబ ఆలయాన్ని గురువారం సందర్శించిన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 20న కేదార్‌నాథ్‌లో పంచ నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని, 25 నుంచి దర్శనాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలన్నారు. ఆయనతో పూజారి శ్రీకాంత్ స్వామి తదితరులు ఉన్నారు.

'బలవంతపు భూసేకరణ ఆపాలి'



మాట్లాడుతున్న జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): పటాన్ చెరువు మండలంలో జరుగుతున్న బలవంతపు భూసేకరణ వెంటనే ఆపేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్వారీలు, క్రషర్ల పేరుతో అసైన్డ్ భూములను కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. పెద్ద కంచర్ల గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాజిస్టిక్ కంపెనీకి అప్పగించడంపై మండిపడ్డారు. తక్షణమే రైతుల భూములను వాపస్ ఇవ్వాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యాదవ రెడ్డి, నాయకులు అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన తన్వీర్

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన తన్వీర్ గురువారం హోం మంత్రి మహమూద్ అలీని కలిశారు. హైదరాబాద్‌లోని హోం మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

'మన ఊరు-మన బడి' పనుల్లో వేగం పెంచాలి

గజ్వేల్: 'మన ఊరు – మన బడి' పనులను వేగంగా పూర్తి చేయాలని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ(తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ ఉమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం గజ్వేల్‌లోని ఐటీసీలో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో కలిసి పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో 92 పాఠశాలల్లో చేపట్టిన పనుల తీరును తెలుసుకున్న ఆయన పనుల్లో నాణ్యతతోపాటు వేగం కూడా కీలకమని చెప్పారు. సమీక్షలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మధు, సెక్టోరియల్ అధికారి రామస్వామితోపాటు ఆయా మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎం, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సర్కారు బడులకు 'సోలార్'

29 స్కూళ్లలో యూనిట్ల బిగింపు

- మొత్తం 90కి పైగా పాఠశాలల ఎంపిక
- 'మన ఊరు మన బడి' కింద ఏర్పాటు



పటాన్‌చెరు మండలం లక్డారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వం సర్కారు బడులకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు కల్పిస్తోంది. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మన ఊరు–మన బడి ' కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలలకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఒక్కో పాఠశాలలో రెండు కిలోవాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ యూనిట్‌లను ఏర్పాటు చేశారు. మన బడి పథకం కింద జిల్లాలో సుమారు 90కి పైగా పాఠశాలలను ఎంపిక చేసి, తొలి విడతలో 29 పాఠశాలలకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇందులో 11 జిల్లా పరిషత్ హైస్కూల్స్ కాగా, మిగిలినవి ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. రానున్న రోజుల్లో మిగిలిన పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

ఒక్కో పాఠశాలకు రూ.1.76 లక్షలు

రెండు కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ యూనిట్‌ను స్థాపించేందుకు మొత్తం 1.76 లక్షల ఖర్చు అవుతోంది. ఈ మొత్తాన్ని సాంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ (టీఎస్‌రెడ్‌కో)కు చెల్లిస్తే, ఆ సంస్థ వీటిని ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతానికి 29 పాఠశాలల్లో బిగించిన సోలార్ యూనిట్ల నుంచి ఉత్పత్తి ప్రారంభమైంది.

బిల్లుల నుంచి ఉపశమనం

సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసుకున్న పాఠశాలలకు ప్రతీనెలా విద్యుత్ బిల్లుల చెల్లింపుల నుంచి ఉపశమనం లభించనుంది. ఈ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో అవసరాలకు పోను మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. ఇందుకోసం విద్యుత్‌శాఖ ప్రత్యేకంగా మీటర్లను బిగించింది. ఆయా పాఠశాలల్లో మిగులు విద్యుత్ ఎంత మేరకు గ్రిడ్‌కు వచ్చిందో లెక్కగట్టి ఆ మొత్తాన్ని పాఠశాలలకు చెల్లిస్తారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఈ చెల్లింపులు చేస్తారని రెడ్‌కో అధికారులు చెబుతున్నారు.

డైరెక్టరేట్ నుంచి పాఠశాలల ఎంపిక..

విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి నాంపెల్లి రాజేష్ 'సాక్షి'తో పేర్కొన్నారు. ప్రస్తుతానికి 29 పాఠశాలలు పూర్తయ్యాయి. త్వరలో మిగిలిన పాఠశాలల్లోనూ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలతో పాటు ప్రైవేటు సంస్థలు వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని టీఎస్ రెడ్‌కో జిల్లా మేనేజర్ మాణిక్యం విజ్ఞప్తి చేశారు. సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

కొత్త విద్యుత్ లైన్లకు జైకా నిధులు



- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ప్రాజెక్టు
- కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న విద్యుత్ శాఖ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రోజురోజుకు పెరుగుతున్న కనెక్షన్ల సంఖ్యతో లైన్లపై భారం పెరిగి నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సబ్‌స్టేషన్లకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. దీనిని అధిగమించేందుకు విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జేఐసీఏ) నిధులతో నూతన ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కింద కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణం చేపడతారు. తద్వారా ప్రస్తుతం ఉన్న విద్యుత్ లైన్లపై భారం (లోడ్) తగ్గిస్తారు. 33 కేవీ, 11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని కూడా పెంచుతారు. అవసరమైన చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం వంటి పనులు చేపడతారు. మొత్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటారు.

రెండేళ్లలో 31 లక్షలు పెరిగిన కనెక్షన్లు..

సంగారెడ్డి జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 5.47 లక్షలు, 1.02 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి తోడు 67 వేల వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉండగా, సుమారు 15 వేల వరకు పరిశ్రమలకు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది. అయితే వేసవిలో ఈ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం ఎక్కువ కావడంతో విద్యుత్ వినియోగం అదే స్థాయిలో పెరుగుతోంది. తద్వారా ఆయా లైన్లకు చివర ఉన్న కనెక్షన్లకు లోఓల్టేజీ సమస్య తలెత్తే అవకాశం ఉంది. దీంతో నాణ్యమైన విద్యుత్ అందదు. ఈ సమస్యలను అధిగమించేందుకు జైకా ప్రాజెక్టు ఉపయోగపడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సమాచారం పంపండి..

జిల్లాలో కొత్త విద్యుత్ లైన్లు ఎంత మేరకు నిర్మించాలి. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఎంత ఉంది వంటి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని విద్యుత్‌శాఖ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆదేశాలందాయి. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈ ప్రతిపాదనలను తయారు చేసేందుకు సిద్ధమైంది. అన్ని మండలాల నుంచి ఈ ప్రతిపాదనలు తీసుకుని పంపేందుకు జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

ఇబ్బంది లేకుండా చెల్లింపులు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: చెరకు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, చెరకు అమ్మిన వెంటనే నగదును రైతులకు చెల్లించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ రమణ కుమార్, జహీరాబాద్ ట్రిడెంట్ కంపెనీ యాజమాన్య బాధ్యులు, కార్మిక శాఖ అధికారులు, కార్మిక సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రైతులు తెచ్చిన చెరకు, ఉత్పత్తి, స్టాక్ తదితర వివరాలను అందుబాటులో ఉంచాలని, స్టాక్ వెరిఫికేషన్ చేసి, అక్రమాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికులు అమ్మకాలను అడ్డుకోవద్దని, సమస్యలు ఉంటే లేబర్ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు తెలియజేయాలన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని కార్మిక సంఘం ప్రతినిధులకు సూచించారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కార్మికుల ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ప్రీమియంను సకాలంలో కట్టాలని కంపెనీ యాజమాన్యానికి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, చక్కెర శాఖ సహాయ కమిషనర్ రాజశేఖర్, డీఎస్పీ, సీఐ, కార్మిక సంఘం ప్రతినిధులు రాములు, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జె.హనుమంతరావు

నారాయణఖేడ్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జె.హనుమంతరావు అన్నారు. న్యాయసేవాధికారిత సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఖేడ్ మండలం చాప్టా(కె), మండల కేంద్రం నిజాంపేట్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. పలు చట్టాలు, సెక్షన్లు, అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కొండాపూర్‌లోని ప్రాచీన హనుమాన్ ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు.



జడ్జి హనుమంతరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బీహెచ్‌ఈఎల్‌లో మాక్ డ్రిల్



అవగాహన కల్పిస్తున్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తులు, అగ్ని ప్రమాదాలు, ఉగ్ర దాడుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెల్ జీఎం శ్యామ్ బాబు, జీఎం హెచ్‌ఆర్ మగేంద్ర వర్మన్, అగ్నిమాపక ఇన్‌చార్జ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్ క్రికెట్ టోర్నీకి దేవరాజ్



దేవరాజ్‌ను సన్మానిస్తున్న యువకులు

దుబ్బాక: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ మీట్ క్రికెట్ టోర్నీకి దుబ్బాక పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారుడు మద్దెల దేవరాజ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు, యువకులు ఆయనకు శాలువతో ఘనంగా సన్మానించారు. పంజాబ్‌లో మార్చి 12 నుంచి 19వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగనుంది. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ.. టీం గెలుపునకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యువకులు దీక్షిత్, వెంకట్, చందురెడ్డి, రఘు, విజయ్, రాజు, తదితరులున్నారు.

జూన్ నాటికి మొక్కలు సిద్ధం చేయాలి



న్యాల్‌కల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న సీఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): వచ్చే జూన్ నాటికి మొక్కల పెంపకం పూర్తి కావాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. గురువారం న్యాల్‌కల్ ఎంపీపీ, పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైకుంఠధామం, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్‌లను ఏర్పాటు చేసి, ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం నీటిని అందించాలన్నారు. వైకుంఠధామంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను రెండు రోజుల్లో తొలగించాలని అధికారులకు సూచించారు. ఆయనతో ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, కార్యదర్శులు నాగభూషణం, కృష్ణ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విష్ణు, సిబ్బంది మొగులప్ప తదితరులు ఉన్నారు.

కర్దనూర్‌లో మాల్దీవ్స్ బృందం పర్యటన

- పల్లె ప్రకృతి వనం, నర్సరీ సందర్శన
- గ్రామ సమగ్ర అభివృద్ధిపై పాలకవర్గానికి అభినందన

పటాన్‌చెరు టౌన్: మండలంలోని కర్దనూర్ గ్రామంలో మాల్దీవ్స్ బృందం సభ్యులు గురువారం పర్యటించారు. గ్రామాల పరిశీలనలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ (ఎన్ఐఆర్డీ) ఆధ్వర్యంలో మాల్దీవ్స్‌కు చెందిన 30 మందితో కూడిన బృందం జిల్లా అధికారులతో కలిసి కర్దనూర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, పారిశుధ్యం, డంపింగ్ యార్డ్‌లను బృందం సభ్యులు పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీపై అడిగి తెలుసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. మాల్దీవ్స్ దేశం ఎక్కువగా టూరిజంపై ఆధారపడిందని, వారి వద్ద చెత్త సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. డంప్ యార్డు నిర్వహణను తమ దేశంలోనూ అమలు చేసేందుకు ప్రతిపాదిస్తామన్నారు. ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపునకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ వారికి వివరించారు. కోతుల ఆహార కేంద్రాన్ని చూసి వావ్.. అంటూ ఆశ్చర్యపోయారు. గ్రామ అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ఎర్రోళ్ల విజయలక్ష్మిని, ఉప సర్పంచు, పాలకమండలిని అభినందించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, ఆశ వర్కర్ల పని తీరు, పంచాయతీ గ్రామ సభ, సర్వసభ్య సమావేశం వివరాలు తెలుసుకున్నారు. మాల్దీవ్స్ బృందంతో డీపీఓ సురేష్ మోహన్, ఎంపీడీఓ బన్సీలాల్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి నీలిమ, పాశమైలారం కార్యదర్శి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



కర్దనూర్ పంచాయతీ వద్ద మాల్దీవ్స్ బృందంతో అధికారులు

మండుతున్న కూరగాయల ధరలు

- బెంబేలెత్తుతున్న పేద, సామాన్య ప్రజలు
- తగ్గిన దిగుబడి, పెరిగిన దిగుమతి

సదాశివపేట(సంగారెడ్డి): ముదురుతున్న ఎండల కంటే కూరగాయల ధరలే అధికంగా మండుతున్నాయి. నిత్యావసరాల ధరలు కొండెక్కడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో పేద కుటుంబాలకు మూడు పుటల కూరగాయల భోజనం తాహతుకు మించిన భారంగా మారుతోంది. ధరలను చూసి బెంబేలెత్తుతున్న ప్రజలు నీళ్ల చారు, పచ్చడి మెతుకులతో సరిపెట్టుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో గుమ్మడిదల, జిన్నారం, కొండాపూర్, సదాశివపేట, కంది, కోహీర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. ఇది జిల్లా అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. పట్టణాలు గ్రామాల్లో జరిగే వారంతపు సంతలకు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి కూరగాయలు అమ్ముతున్నారు. సాగు గణనీయంగా తగ్గిపోవడం, ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేసుకోవాల్సి వస్తోంది. బెండకాయ, వంకాయ, పచ్చిమిర్చి, క్యారెట్, కాకర, గోరుచిక్కుడు, బీరకాయ, దొండకాయి, బీన్స్ ఏది కొందామన్నా రూ.60 నుంచి రూ.80 వరకు తక్కువ ఎక్కడా దొరకడంలేదు. వారం క్రితం వరకు టమాటా కేజీ రూ.10 ఉండగా ప్రస్తుతం రూ.30కి చేరింది. వారం క్రితం కేజీ రూ.20 ఉన్న పచ్చిమిర్చి ప్రస్తుతం రూ.60కి చేరింది, కూరగాయల ధరలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నలుగురు ఉన్న కుటుంబం వారం క్రితం కిలో కూరగాయలు కొనగా, ప్రస్తుతం పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. మరికొంద రైతే చారు, పచ్చళ్లతో సరిపెట్టుకుంటున్నారు.



సిద్ధాపూర్‌లో ఓ కూరగాయల దుకాణం

తగ్గిన దిగుబడి

జిల్లాలో రైతులు సాగుచేస్తున్న కూరగాయలు ఎండలకు ఎండిపోవడం దిగుబడులు తగ్గడంతో సరిపోవడం లేదు. రైతులు పండించిన వివిధ రకాల కూరగాయలు 7వేల టన్నులు మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రతీ రోజు జిల్లాకు 17వేల టన్నుల కూరగాయలు అవసరం. జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, ప్రాంతాలతోపాటు పట్టణం, మండలాల్లో జరిగే వారాంతపు సంతలకు ఎక్కువగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి 70 శాతం దిగుమతి అవుతున్నాయి. మరో 10వేల టన్నుల కూరగాయల అవసరం ఏర్పడుతుంది. సంగారెడ్డి జిల్లాకు చత్తీస్‌ఘడ్, కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఎక్కువగా దిగుమతి చేస్తుండడంతో రవాణా చార్జీలతో కలిపి ధరలు డబుల్ అవుతున్నాయి. బీర, కాకర, సోరకాయ, క్యాప్సికమ్, క్యాబేజి, క్యారేట్, క్యాలిఫ్లవర్, తదితరాలు 7వేల టన్నులు దిగుమతి అవుతున్నాయి.

ఏం కొనేటట్టు లేదు



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. రూ.40 ఉన్న బెండకాయ, బీరకాయ ఇప్పుడు రూ.80 చెబుతున్నారు. మధ్యతరగతి కుటుంబాల వారికి చాలా కష్టం. అర కిలో పావు కిలోతో సరిపెట్టుకుంటున్నాం.

– బుజ్జమ్మ, సదాశివపేట

ఒక్కసారిగా పెరిగాయి



ధరలు ఒక్కసారిగా పెరిగాయి. వారం కిందట, ప్రస్తుతం ధరలకు ఎంతో తేడా ఉంది. ఏది కొనాలన్నా రూ.50పైనే ఉంది. ఇలాగైతే సామాన్యులు బతకడం కష్టమే. – అనసూజ, సదాశివపేట

క్లుప్తంగా

చెరువులో స్నానానికి వెళ్లి వ్యక్తి గల్లంతు

తూప్రాన్: దశదినకర్మకు హాజరై చెరువులో స్నానానికి దిగిన వ్యక్తి గల్లంతైన విషాదకర ఘటన మండలంలోని ఘణపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం ఎస్ఐ సురేశ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామస్తుడు చనిపోవడంతో అతడి దశదినకర్మకు అదేగ్రామానికి చెందిన సింగాటం పర్వతాలు హాజరయ్యాడు. దశదినకర్మ పూర్తయిన తర్వాత స్నానం చేయడానికి గౌత చెరువులో దిగి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్ల సాయంతో సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. గురువారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, మరో ముగ్గురికి రూ.3 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


సురేశ్ (ఫైల్)

ఝరాసంగం (జహీరాబాద్): అత్తగారింటికి వచ్చిన అల్లుడు సికింద్రాబాద్ వెళ్తున్నానని చెప్పి వెళ్లి కనిపించకుండా పోయాడు. గురువారం పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయికోడ్ మండల పరిధిలోని కుసునూరు గ్రామానికి చెందిన బెగరి సురేశ్(40) తన కుటుంబంతో కలిసి సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఫిబ్రవరి 18వ తేదీన బర్దిపూర్ గ్రామంలోని తన అత్తగారింటికి వచ్చాడు. సికింద్రాబాద్ వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు. కానీ ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. భార్య బేగరి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ రెడ్డి వివరించారు.

యువకుడికి కత్తిపోట్లు

జహీరాబాద్‌టౌన్: యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. శాంతి నగర్‌కు చెందిన మన్నన్(30) బుధవారం అర్ధరాత్రి పట్టణం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడి చేసి పరాయ్యారు. తీవ్రగాయాలైన మన్నన్‌ను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పాత కక్షల నేపథ్యంలో దాడి జరిగినట్లు జహీరాబాద్ టౌన్ పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మహిళకు శస్త్రచికిత్స

6 కిలోల కణితి తొలగింపు

మెదక్ జోన్: కడుపునొప్పితో బాధపడుతున్న మహిళకు వైద్యులు శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన దుర్గమ్మ ఐదేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. గురువారం మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌కు వెళ్లగా ఆమెకు డాక్టర్ సురేశ్ వైద్య పరీక్షలు చేయంగా కడుపులో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స చేసి తొలగించారు. ప్రస్తుతం దుర్గమ్మ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యుడు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



దుబ్బాకరూరల్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని పద్మశాలిగడ్డలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు పోతుగంటి దేవయ్య తన వ్యవసాయ పొలం వద్ద పాడిగేదెను కట్టేశాడు. బోర్ మోటర్ సర్వీస్ వైర్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

నీళ్లు.. మింగేస్తున్నాయ్

- ఉమ్మడి మెదక్ జిల్లాలో నీటి ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న ఈత సరదా
- ఐదు రోజుల్లో ఎనిమిది మంది మృత్యువాత
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు


రంగనాయకసాగర్ రిజర్వాయర్ లోపల ఫొటోలు దిగుతున్న యువకులు


ఎన్సాన్‌పల్లి చెరువు వద్ద కనబడని హెచ్చరిక బోర్డులు

సాక్షి, సిద్దిపేట: ఈత సరదా, చేపల వేట, స్నానాలు చేసేందుకు వెళ్లేవారిని చెరువులు మింగేస్తున్నాయి. ఈత సరదా పలువురి కుటుంబాల్లో విషాదం నింపుతోంది. ఈత రాకపోవడం, ప్రమాదకర ప్రదేశాల హెచ్చరికలు లేకపోవడంతో స్నేహితులతో కలిసి చెరువులు, చెక్ డ్యాంల వద్దకు వెళ్లే పిల్లలు, యువకులు ప్రమాదాలను అంచనా వేయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఎండల వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, యువకులు సరదాగా జల వనరుల్లో ఈత కొట్టేందుకు వెళ్తున్నారు. చెరువులు, కుంటలు, వాగుల్లో తవ్వి మట్టి దర్జాగా తోడేస్తున్నారు. ఇలా మట్టి తీసిన చెరువుల్లో యువకులు ప్రమాదవశాత్తు పడి తల్లిదండ్రులు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్న కనీస నియంత్రణ చర్యల దిశగా అడుగులు పడటం లేదు. ప్రజాప్రతినిధులు, పోలీస్, నీటిపారుదల శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు రోజుల వ్యవధిలో..

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఐదు రోజుల్లో ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. కొందరు ఈత కోసం, స్నానం కోసం, మరికొందరు చేపల వేట, కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులు, చెక్ డ్యాంలకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందుతున్నారు. 8, 9 తేదిల్లోనే నలుగురు మృతి చెందారు. అందులో ఇద్దరు తండ్రీకొడుకులు, మరో ఇద్దరు తాత మనవలు.
- సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ఎల్లమ్మచెరువులో గొర్రెలను తండ్రీకొడుకులు కనకయ్య(50), అరవింద్(13) ప్రమాదవశాత్తు గురువారం చెరువులో పడి మృతిచెందారు.
- ఈనెల 8న సిద్దిపేట జిల్లా ములుగు మండలం కుడిగుంట్లవాగు గుంతలో మనవడికి తాత ఈత నేర్పించేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు వారిద్దరు నీట మునిగి మృత్యువాతపడ్డారు.
- ఈ నెల7న హోలీ ఆడుకుని స్నానం చేసేందుకు చెరువు, కుంటలోకి వెళ్లి ముగ్గురు మృత్యువాత పడ్డారు. సంగారెడ్డి జిల్లా ఖాజీపల్లి ప్రాంతంలోని క్వారీ కుంటలోకి స్నానంచేసేందుకు వెళ్లిన సాయి కిరణ్(17) నీట మునిగి మృతి చెందాడు. అలాగే గడ్డిపోతారం సమీపంలోని అయ్యమ్మ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన సోనూసింగ్(36) ఈత రాకపోవడంతో మునిగి మృతి చెందాడు. ఖేడ్ మండలం తుర్కాపల్లికుంటలో మేదరి అశోక్(30) స్నానం చేసేందుకు వెళ్లి మృత్యువాతపడ్డాడు.
- ఈనెల 5న మెదక్ జిల్లా ఏడుపాయల దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తుడు అక్కడే ఉన్న చెక్ డ్యాంలో స్నానం చేస్తుండగా అందులో పడి వెంకటేశ్(26) ఈత రాక మృతి చెందాడు.

ప్రమాదాలకు కారణాలు ఇవే

- జిల్లాలోని చెరువుల్లో మట్టి కోసం గుంతలు తవ్వ వదిలేస్తున్నారు. ఈ గుంతల్లోకి నీరు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారులు సెలవు రోజుల్లో జలాశయాలు, పెద్ద పెద్ద కాలువల్లో స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్తున్నారు. బురద గుంతలు, జలాశయాల్లో ఊబిలో కూరుకుపోయి మృత్యువాతపడుతున్నారు. ఈతరాని పిల్లలు కాలువలు, చెరువుల్లోకి వెళ్తే మునిగిపోతారు. యువత కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాగే చెరువు, రిజర్వాయర్ అంచునకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద ఫొటో దిగేందుకు లోపలికి వెళ్తున్నారు.
- త్వరలో ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. పరీక్షల అనంతరం విద్యార్థులకు వేసవి సెలవులు రానున్నాయి. ఆ సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.

ఈతకు దిగేవారు పాటించాల్సిన జాగ్రత్తలు

- చెరువులు, కాల్వలు, చెక్ డ్యాంలు ఎక్కడైనా సరే స్నానానికి దిగాలంటే ముందుగా ఈత పట్ల అవగాహన, నైపుణ్యం తప్పనిసరి.
- చెరువులు, రిజర్వాయర్లలో పూడిక ఎక్కువగా ఉంటుంది. పైకి నీరుమాత్రమే కనిపిస్తుంది. ఆ విషయం తెలియక ఎవరైనా కాళ్ల కింద గట్టి నేల ఉంది కదా? అని ముందుకు అడుగువేస్తే ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.
- స్నానాలకు దిగేవారు ఈత వచ్చినప్పటికీ లైఫ్‌జాకెట్లను ధరించడం మంచిది.
- చెరువు, రిజర్వాయర్, చెక్ డ్యాం అయినా నాలుగు అడుగులకు మించి నీటిలోకి వెళ్లకూడదు.
- ఈతకు వెళ్లేప్పుడు తోడుగా ఎవరినైనా తీసుకువెళ్లాలి. ఒకరు ఒడ్డున ఉండి అప్రమత్తం చేస్తుండాలి.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి

పిల్లలను ఒంటరిగా చెరువులు, కుంటల దగ్గరకు పంపించకూడదు. మరికొద్ది రోజుల్లో పిల్లలకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్నందున మధ్యాహ్నం తర్వాత పిల్లలు గ్రామాల్లో చెరువుల దగ్గరికి వెళ్లే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. గ్రామాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళా బృందంతో అవగాహన కల్పిస్తాము. గ్రామాల్లో చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయిస్తాం. గ్రామ సర్పంచుల సహకారంతో గ్రామాల్లో చాటింపు వేయిస్తాం.

– మహేందర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్

గొర్రెలను కడగడానికి వెళ్లి..

నీట మునిగి తండ్రీ కొడుకు మృతి


చెరువు వద్ద రోదిస్తున్న బంధువులు


కనకయ్య (ఫైల్)


అరవింద్ (ఫైల్)


మృతదేహాన్ని బయటకు తెస్తున్న గజ ఈతగాళ్లు

చేర్యాల(సిద్దిపేట): చెరువులో గొర్రెలను కడిగేందుకు వెళ్లి నీట మునిగి తండ్రీకొడుకులు మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలోని చేర్యాల మండలం ఆకునూరులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బత్తుల కనకయ్య, స్వరూప దంపతులకు ముగ్గురు కొడుకులు. కనకయ్య(50), స్వరూప, అరవింద్(17) గొర్రెలు కాసేందుకు వెళ్తుండగా, మరో ఇద్దరు కుమారులు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీలా గురువారం గొర్రెలు కాసేందుకు వెళ్లిన కనకయ్య, అరవింద్ గ్రామ శివారులోని ఎల్లమ్మ చెరువులో గొర్రెలు కడిగేందుకు దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో లోతైన ప్రాంతంలో నీటిలో మునిగిపోయారు. గట్టుపై నుంచి గమనించిన భార్య స్వరూప ఏడుస్తూ కేకలు పెడుతుండటంతో సమీపంలో ఉన్నవారు వచ్చారు. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. గొర్రెలు కాస్తూ జీవనం సాగించే నిరుపేద కుటుంబానికి చెందిన తండ్రి కొడుకుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఆటో నడుపుతుండగా..

గుండెపోటుతో డ్రైవర్ మృతి


నారాయణ (ఫైల్)

మెదక్ రూరల్: గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన హవేళిఘణాపూర్ మండల పరిధిలోని చౌట్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హవేలిఘనపూర్‌కు చెందిన నారాయణ కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం హవేలిఘనపూర్ నుంచి చౌట్లపల్లికి ప్రయాణికులను వదిలి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో మార్గమధ్యలో నారాయణ(55)కు గుండెపోటు రావడంతో ఆటో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు నారాయణను ఆటోలో నుంచి బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు.

మహిళలకు రక్షణ కల్పించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కళావతి


మాట్లాడుతున్న శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కళావతి

సిద్దిపేటఅర్బన్: సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, వారికి రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కళావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే వాటిని అరికట్టకుండా మహిళలపైనే కేంద్ర మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పటిష్టమైన చట్టాల అమలుతో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతీపనిలో సగభాగంగా ఉన్న మహిళలకు ఉత్పత్తిలో వచ్చిన లాభంలో సగం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా కఠిన చట్టాలు తీసుకువచ్చి రక్షణ కల్పించినప్పుడే వారికి నిజమైన గౌరవం ఇచ్చినట్లని అన్నారు. సదస్సులో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నవీన, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, స్నేహ ఇంటి పరివార సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, పద్మ, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

హత్యపై ఆరా తీసిన ఎస్పీ


బద్దారం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

బద్దారం గ్రామంలో పర్యటన

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల పరిధి బద్దారం గ్రామానికి చెందిన గాజు రవీందర్ దారుణహత్యకు గురికావడంతో గురువారం మెదక్ ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని గ్రామాన్ని సందర్శించారు. హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం రాత్రి మృతుడి వెంట ఆటోలో ప్రయాణిస్తున్న దొబ్బ భూమయ్యకు సైతం తీవ్ర గాయాలు కావడంతో అతడిని సంగారెడ్డి ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి వెంట ఉన్న మరో వ్యక్తి ప్రభాకర్ పరారీలో ఉన్నాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ వెంట మెదక్ డీఎస్పీ సైదులు, అల్లాదుర్గం సీఐ జార్జ్, పేట ఎస్ఐ బాలరాజ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

భూ వివాదంలో ఘర్షణ

టేక్మాల్(మెదక్): భూ వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన టేక్మాల్ మండలంలోని పల్వంచ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్వంచ గ్రామ శివారులోని ఓ భూ వివాదంలో సంగారెడ్డి జిల్లా జోగిపేట, పల్వంచకు చెందినవారు ఘర్షణ పడ్డారు. ఘర్షణలో జోగిపేటకు చెందిన ఫైజల్‌కు తీవ్ర గాయాలవడంతో సంగారెడ్డిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. గురువారం ఇరువర్గాల వారు టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

సర్వీస్ వైరు చోరీ

చర్యలు తీసుకోవాలని డిమాండ్

కొండాపూర్(సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని బోరు సర్వీసు వైరును ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చెర్ల గోపులారం శివారు పొలాల్లోని 30 మందికి చెందిన బోర్ల సర్వీసు వైరును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సుమారు రూ.3 లక్షలు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెర్ల గోపులారంలోనే కాకుండా మారేపల్లి, తొగర్‌పల్లి గ్రామాలలో కూడా సర్వీస్ వైరు చోరీ చేసినట్లు సమాచారం. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ వెంకటేశంను ఫోన్‌లో సంప్రదించగా ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆటో బైక్ ఢీ: ఐదుగురికి గాయాలు

ఝరాసంగం(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో ఆటో, బైక్ ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ఇద్దరితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఝరాసంగం మండల పరిధిలోని నర్సాపూర్, కంబాలపల్లి, ప్యారవరం గ్రామాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిసింది. చికిత్స నిమిత్తం వారిని జహీరాబాద్, సంగారెడ్డిలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవ్మరణానికి పాల్పడ్డారు. జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. అలాగే మరో చోట మగబిడ్డ పుట్టలేదని మహిళ పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసు కేసు నమోదవడంతో భార్యాపిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయా ప్రాంతాల పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తాటి రాజు (ఫైల్)

దుబ్బాక: జీవితంపై విరక్తితో తాగిన మైకంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సూరంపల్లి గ్రామానికి చెందిన తాటి రాజు (28) రాయపోల్ మండలం అంకిరెడ్డి పల్లి గ్రామంలోని ఓ దాబాలో పనిచేస్తున్నాడు. జీవితంపై విరక్తితో మద్యం మత్తులో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సంతోష మృతదేహం

నిజాంపేట(మెదక్): మగబిడ్డ పుట్టలేదని మనస్థాపంతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండలం రజాక్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి కాశింపూర్ తండాకు చెందిన లాడియా సంతోష (27)కు అదే తండాకు చెందిన లాడియా రామ్‌చందర్‌తో తొమ్మిదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం మగబిడ్డ పుట్టి చనిపోవడంతో అనారోగ్యానికి గురైంది. ఆపరేషన్ కావడంతో తనకు మగ సంతానం కలగదనే మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి అంబరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.


రామకృష్ణ మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: పోలీసు కేసుతోపాటు భార్యాపిల్లలు దూరమవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పిట్లంబేస్ వీధికి చెందిన మోహిగారి రామకృష్ణ(40)పై 498ఏ కేసు నమోదు కాగా ప్రస్తుతం కోర్టులో ఉంది. దీంతో అతడి భార్య గాయత్రి, పిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపానికి గురైన రామకృష్ణ గురువారం ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

చేర్యాల(సిద్దిపేట): లారీ ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన చిలువేరు ఐలయ్య(58) కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో కొమురవెల్లి జాతరకు వెళ్తున్నాడు. గురువారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో కొత్త బస్టాండ్ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో ఐలయ్య తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జేసీబీని ఢీకొన్న బైక్


గాయపడిన సిద్దిరాములు

మనోహరాబాద్(తూప్రాన్): జేసీబీని బైక్ ఢీ కొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డికి చెందిన సిద్దిరాములు తన కుమారుడిని తీసుకుని బైక్‌పై మేడ్చల్ నుంచి కామారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కాళ్లకల్ శివారులో అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన జేసీబీని ఢీ కొన్నాడు. దీంతో సిద్దిరాములు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు.

మహిళా అధికారులకు సన్మానం


కలెక్టరేట్‌లో మహిళా అధికారులు

మెదక్ కలెక్టరేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో రైతు సహాయవేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయశాఖ మహిళా అధికారులను సన్మానించారు. జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్, ఉద్యానవన అధికారి నర్సయ్య, డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో రైతుసహాయ వేదిక ప్రతినిధులు డాకూరి వెంకటేశం, శంభు కుమార్, కుంట రాములు, సుభాష్, ఆయా మండలాల సహాయ వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు తదితరులు పాల్గొన్నారు